# అనురాగ బంధాలు

—జి. నరసింహ మూర్తి

శ్యామల

నాది దురదృష్ట జీవితం. పుట్టగానే మూగదాన్ని. మాట్లాడటానికి నోచుకోని నా యీ జీవితాన్ని తలచుకుంటూ విచారించనిరోజు అంటూలేదు. అయితే ఒక్క మూగతనం తప్పించి ఎందులోను నాకు లోటు లేదు. నాకు మాటతెప్పించాలని మా నాన్నగారు ఎంతోమంది డాక్టర్లకు చూపించారు. కాని ఫలితం శూన్యం. విధిని నిందించుకోవడం తప్పించి మరేమి చేయలేకపోయాను.

మా నాన్నగారు హైదరాబాద్‌లో ఒక పెద్ద ఆఫీసర్ నా తరువాత ఒక చెల్లెలు. వారివద్దే వుండి కాలేజీలో మెడిసన్ చదువుకుంటోంది. మా చెల్లెలు పుట్టగానే మా అమ్మ మాకు కనబడని లోకాలకు వెళ్ళిపోయింది. నన్ను మాత్రం మా తాతయ్యగారి దగ్గరవుంచివేసారు. కారణం మా తాతయ్యకు మా అమ్మతప్పించి పిల్లలు లేరు. నేను నాబాల్యంనుండి మా తాతయ్య, అమ్మమ్మల పెంపకంలోనే పెరిగేను. ఎప్పుడైనా మా నాన్నగారు చెల్లెలు వచ్చి చూసి వెళ్ళడం తప్పించి నేను వాళ్ళ వద్దకు వెళ్ళలేకపోయాను.

నేనంటే మా తాతయ్యకు చెప్పలేని ప్రేమ. ఎంతో అభిమానం. అచ్చం నేను మా అమ్మలాగే వుంటానుట. అందుకే నన్ను వాళ్ళు కంటికిరెప్పలా కాపాడుకునే వారు. ఎంతోఅపురూపంగా పెంచి పెద్దదాన్ని చేసారు.

నా కిప్పుడు ఇరవై ఏళ్ళు...ఇన్ని సంవత్సరాలు అప్పుడే నాకు వచ్చేయంటే చాలా ఆశ్చర్యంగా వుంటుంది. మా తాతయ్య నా పెళ్ళికి తెగఆరాటపడి పోయేవాడు. నన్ను ఎవరైనా పెళ్ళిచేసుకుంటానంటే తనకున్న ఆస్తినంతా ఇచ్చివేస్తాననేవాడు. అయినా ఎవ్వరూ ముందుకురాలేదు. అందుకు కారణం నా మూగతనమే.

చిన్నతనంలోనే ఐదవ తరగతి వరకు చదువుకున్నాను. ఆ తరువాత చదువుకుందామనుకున్నా పరిస్థితులు ఆ కాస్త అవకాశాన్ని కూడా లేకుండా చేసాయి. స్కూలులో అప్పటికే మూగపిల్ల అని అందరూ అనడంతో నేను ఆ బాధ భరించలేక మాని వేసాను. కాని నాకు మా తాతయ్య మాష్టారునుపెట్టి 'వీణ' నేర్పించారు. అదే నాలో జీవంపోసింది. ప్రతిరోజు ఉదయం లేవగానే రెండు త్యాగరాజు కృతులు వాయించే దాన్ని. ఇలా సాగిపోతూంది నా జీవితం.

ఆ రోజు.........

నా జీవితంలో మర్చిపోనిరోజు అది. ఎడారిలాంటి నా జీవితంలో ఎదురైన బాటసారి 'శ్రీధర్'. ఆయనను చూడగానే ఎక్కడో, ఎప్పుడో కొన్ని జన్మలక్రితం చూసిన అనుభూతి కలిగింది. ఎన్నడూలేని హృదయ స్పందన కలిగింది.

ఉదయం పదిగంటలకు కాబోలు ప్రక్కింటి ప్రసాదన్నయ్య, శ్రీధర్ని తీసుకొని మా ఇంటికి వచ్చేడు. హాలులో చుట్ట కాల్చుకుంటూ కూర్చొని వున్న మా తాతయ్య వాళ్ళను చూసి

"ఏరా ప్రసాద్ ఈ మధ్య కనబడటం లేదే వూళ్లో లేవా ? రండి కూర్చోండి అంటూ కుర్చీలు చూపించి "ఆవును ఈయ నెవ్వరు ?" అని అడిగేడు.

"వీడు నా చిన్ననాటి స్నేహితుడు బాబాయి. ఇద్దరంకలసి చదువుకున్నాం. ఇప్పుడు వీడు పట్నంలో డాక్టర్. నాలుగురోజులు సెలవు పెట్టి వచ్చేడు ఇక్కడ గడపాలని. పేరు శ్రీధర్" అని పరిచయం చేసాడు.

అలాగా రండి కూర్చోండి బాబు...... అమ్మా శ్యామలా రెండు కప్పుల కాఫీ పంపించు" అని కేక వేసాడు.

వంటింట్లోకి వెళ్ళి నేనే స్వయంగా కాఫీతయారు చేసి పనిపిల్లతో కాఫీలు హాలులోకి పంపించి, నేను గుమ్మానికి కట్టివున్న తెర వెనుక నిలబడిపోయాను. గాలికి తెర కదులుతున్నప్పుడు మాత్రం మధ్య మధ్య శ్రీధర్ని చూసాను. మగవాళ్ళల్లో కూడా ఇంత అందమైన వాళ్ళు వుంటారని నేను ఆనాడే అనుకున్నాను

ప్రసాద్ అంటున్నాడు "ఉదయం మన శ్యామల 'వీణ' వాయిస్తూ వుంటే మావాడు ఒక్కటే ఆశ్చర్యం బాబాయి. ఈ పల్లెటూరిలో ఇంతబాగా వాయించే వారెవ్వరా అని. వీడికి సంగీతం అంటే తగనిపిచ్చి...

శ్రీధర్ నవ్వి వూరుకున్నాడు. నిజంగా ఆ నవ్వు ఎంత బాగుంది. నాకు వచ్చిన ఆ ఒక్కవిద్యఅయినా మరొకరి మనస్సుకు నచ్చినందుకు ఎంతో సంతోషించాను.

ఆ మర్నాడు రాత్రి నిండుపున్నమి వెన్నెల వెదజల్లుతూ ప్రకృతి ఎంతో హాయిగా వుంది.

భోజనాలు అయినతరువాత అందరం డాబామీద కూర్చొన్నప్పుడు 'శ్రీధర్' అన్నారు "ఇటువంటి వాతావరణంలో శ్యామల వీణ వాయిస్తే ఎంతో బాగుంటుందని". తాతయ్య కూడా బలవంతం చేయడంతో ఇక నాకు తప్పించుకునే మార్గం లేక పోయింది. క్రిందకు వెళ్ళి వీణ తెచ్చుకొని శృతిచేసి రెండు కృతులు వాయించాను.

"ఈ వీణతో పాటు కలిసిపాడితే మరింత బాగుంటుంది" అన్నారాయన.

అంతే నాలో వున్న నాడులన్నీ ఒకేసారి తెగినట్లైంది.

ప్రసాద్ నిమ్మదిగా అంటున్నాడు. సారీ రా శ్రీధర్. భగవంతుడు నా చెల్లెలుకు అన్నీ ఇచ్చేడు. ఒక మాట్లాడకపోవడకం తప్పించి."

"ఈజిట్" శ్రీధర్ ఆశ్చర్య పోయాడు.

తాతయ్య నిమ్మదిగా అంటున్నాడు. "అవును బాబు నా తల్లికి ఆ ఒక్కలోటు తప్పితే మరేమిలేదు."

రాబోతున్న కన్నీటిని బలవంతంగా ఆపుకొని క్రిందకు వచ్చివేసాను.

అప్పటినుండే ఆరాధన, ప్రేమ అంటేఏమిటో ఈ మూగదాని జీవితంలో ప్రారంభించాయి. శ్రీధర్ నా మనస్సులో మెదిలినప్పుడల్లా నాలో నాకే తెలియని ఆనందం కలిగేది. అయితే లేనిపోని ఊహలు పెంచుకుంటున్నానని నాకు తెలియకుండా పోయింది. అందుకే అతని ప్రతిబింబాన్ని నా మనస్సులో నిలుపుకొని గుడ్డిగా ఆరాధించడం మొదలుపెట్టేను. అది ఎవ్వరికీ తెలియదు. కాని భగవంతుడు నామొర ఆలకించాడు.

ఒకరోజు ప్రసాద్ వచ్చి తాతయ్యతో అంటున్నాడు. బాబాయి... శ్రీధర్ ... శ్యామలను పెళ్ళి చేసుకుంటాడట మీకిష్టమేనా" అని.

తాతయ్య కొన్ని నిమిషాలు ఏమీ మాట్లాడలేక పోయాడు అదంతా నా బంగారుతల్లి అదృష్టం' అని అనగలిగేడు.

శ్రీధర్

ప్రతివ్యక్తి జీవితంలో అదృష్ట, దురదృష్టాలు వుంటాయి. అయితే అవిరెండు నా జీవితంలో సమానంగానే వున్నాయి.

నా చిన్నతనంలోనే నా తండ్రి చనిపోవడం జరిగింది. నేను ఒక్కడ్నే కావడంవలన నాతల్లి నన్ను ఎంతో ప్రేమగా పెంచింది. నాకు బంగారుభవిష్యత్తు కలిగించాలని ఎంతో ఆరాటపడింది. నన్ను క్రమశిక్షణతో పెంచి తన ఆశయాలుకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవాలని ఆశించింది. వున్న కొద్ది ఆస్తిలోనే నన్ను కష్టపడి మెడిసిన్ చదివించింది. అందుకే మా అమ్మంటే నాకు ఎనలేని గౌరవం, భక్తి వుండేవి. ఎన్నడు ఆమెకు కష్టం కలిగించే పని ఏమిచేయలేదు.

నేను మెడిసిన్ రెండవ సంవత్సరంలో వుండగా నిర్మలతో పరిచయం అయింది. 'నిర్మల' తో పరిచయం అవడమే ఏదో గొప్పగా భావించుకునేవాణ్ణి. ఆమె కలవారిబిడ్డ. అయితే అది మా స్నేహానికి అడ్డు రాలేదు. ఒకో సంవత్సరం గడచినకొలది మా పరిచయం ప్రేమగా మారి, రోజు ఒకరినొకరు చూసుకోకుండా వుండలేకపోయేవాళ్ళం. ప్రస్తుతం ఇద్దరం హౌస్ సర్జన్స్‌గా పనిచేస్తున్నాం. ఇది పూర్తిఅవగానే పెద్దల ఆశీస్సులతో పెళ్ళి చేసుకొని స్వంతంగా ప్రాక్టీసు చేయాలనుకునేవాళ్ళం.

నిర్మల అప్పుడప్పుడు మా ఇంటికి వచ్చి మా అమ్మతో పరిచయం పెంచుకుంది. ఆమెను చూడగానే మా అమ్మ మురిసిపోయింది.

నాది చాలా సున్నితమైన హృదయం. ఒకోసారి చిన్నవిషయానికైనా చాలా సెన్సిటివ్‌గా ఆలోచించేవాణ్ణి. నిర్మల ప్రేమను నేను అందుకోవడంలోకూడా అదే జరిగింది.

కాని నాజీవితంలో అనుకోనిమార్పు జరిగిపోయింది. ఒకోసారి భగవంతుని లీలలు ఎవ్వరికీ అర్థం కావు.

ప్రసాద్ వాళ్ళ ఊరు వెళ్ళినప్పటినుండి నాజీవితం మరో మలుపు తిరిగింది ... నేను నడుస్తున్నబాటలో 'శ్యామల' ఎదురైంది. భగవంతుడు అందమంతా ఆమెలోనే వుంచేడా అని అనిపించింది. నిజంగా 'శ్యామల' ను చూడగానే ఎక్కడో ఎప్పుడో కొన్ని జన్మల బంధం మా మధ్య వుందనిపించింది. అనుక్షణం ఆమె ముందు కూర్చుని కబుర్లు చెప్పాలని ఆరాటం అయితె దురదృష్టవశాత్తు ఆమె మూగది అని తెలిసినప్పుడు నేనుపడ్డ బాధ వర్ణనాతీతం ... నాకు తెలియకుండానే ఆమె నా హృదయంలో చోటుచేసుకుంది. అందుకు కారణం ఆమెను చూస్తే జాలా మరేదో నాకే తెలియదు ... అయితే ఆమెను దూరం చేసుకోవడంలో ఆలశ్యమైతే మరిక కలవడం అసాధ్యమనిపించింది. ఆమెను గురించి నేను ఆలోచించని క్షణం అంటూ లేదు.. ఎందుకో ఆమెకళ్ళు పదే పదే గుర్తుకువచ్చేవి. ఆ కళ్ళల్లో కనబడే మెరుపుకే నేను ఆకర్షితుడనైనాను. ముగ్ధమైన ఆమె అమాయికత్వమే నాలో చోటు చేసుకుంది. కొన్నిరోజులు నిద్రకూడా మానివేసి ఆమెనుగురించి ఆలోచించేవాణ్ని. ఆమెకు ఒక్క మాట్లాడలేకపోవడం తప్పించి మరే లోటూ లేదనిపించేది. అయితే నాయీ ఆలోచనలలో నన్ను ప్రేమించిన 'నిర్మల' ఎంతో దూరం వెనకకు వెళ్ళిపోయింది.

నన్ను ఎంతో అపురూపంగా పెంచి పెద్దచేసిన నా తల్లికి ఈఒక్కవిషయంలోనే ఎంతోబాధను కలిగించిన వాడనైనాను. ఈ విషయం ఆమెకు చెప్పినప్పుడు ఎంతో బాధపడింది. 'కోరి ఎందుకు కష్టాలు కొని తెచ్చుకుంటావు' అని వాపోయింది.

అలా అనకమ్మా నీ ఆశీర్వాదబలమే నాకిప్పుడు కావలసింది, అంతకన్నా ఎక్కువగా ఏమీ కోరను.

"అది కాదురా ! ఆమె మూగది అంటున్నావు. ఇటువంటి నిర్ణయం తీసుకోవడం వలన నీ బంగారు భవిష్యత్తు ఏ మౌతుందో ఆలోచించావా ?"

"శ్యామలకు మాటలేని మాట నిజమేనమ్మా ! కాని ఆమెకు మాటరావడానికి నేను ఎంతో ప్రయత్నం

చేస్తాను. విజ్ఞానం ఇంత అభివృద్ధిచెందిన ఈరోజుల్లో అది ఏమంత కష్టం కాదు". అన్నాను ఆవేశంగా!

అయితే 'నిర్మల' ను ఏంచేస్తావు? ఇది నిజ జీవితం. అందుగురించే బాగా ఆలోచించ మంటున్నాను...

అవును 'నిర్మల' కు ఈ విషయం చెప్పితే తట్టుకోగలదా! నన్ను దుర్మార్గుడుగానే భావిస్తుంది, సందేహంలేదు. కలిసి చదువుకొని, మనస్సులు విప్పుకొని: జీవన నౌకలో ఇద్దరం కలసి ప్రయాణంచేసి ఆవలి ఒడ్డుకు చేరాలనుకునే తరుణంలో ఆమెను నదిలోత్రోసి తను ముందుకు సాగిపోతున్నట్లుగానే తలపోస్తుంది,

అందుకే డైరక్ట్‌గా ఈ విషయాలు ఏమి చెప్పలేక ఒక సుదీర్ఘమైన ఉత్తరం వ్రాసి ఆమెకు అందజేసి తన నిర్ణయం వెంటనే చెప్పమని అడిగేను...

నాలో వస్తున్న మార్పును ఆ కొద్ది రోజులలోనే గ్రహించింది కాబోలు ఉత్తరం ఇవ్వగానే కంగారు పడింది...

ఏమవుతుందో ఆ పైన దైవ నిర్ణయం.

నిర్మల

నేను పుట్టగానే తల్లిని పొగొట్టుకున్న దురదృష్ట జీవిని. మా తాతయ్య నన్ను చూడగానే పురుగును చూసినట్లు చూసేవాడు. కారణం తల్లిని దిగమింగిన రాక్షసి అని... అయితే మా నాన్నగారు వీటన్నిటికి అతీతం. నన్ను ఎంతో ప్రేమగా చూసుకునేవారు. నేను పుట్టిన తరువాత వారికి అన్నివిధాల కలసి వచ్చిందని ఆయన నమ్మకం. నన్నెంతో గారాబంగా పెంచేరు. నే నేది కావాలనుకుంటే అది క్షణాలలో అది నాముందు వుండేది. అటువంటి వాతావరణంలో పెరిగేను. నా కోసమే మరలా మా నాన్నగారు, పెళ్ళిచేసుకోలేదు అనేవారు.

జీవితాన్ని ఎప్పుడు తేలికగానే తీసుకొని హాయిగా గడిపివేయడం తప్పించి మరేమి నాకు తెలియదు.

మెడిసన్ చదువుతాను అనగానే ఎంతో సంతోషించారు. రెండవ సంవత్సరంలో వుండగా 'శ్రీధర్'తో నాకు పరిచయమైంది. ఆ పరిచయంకూడా చాలా విచిత్రముగానే జరిగింది.... శ్రీధర్ బ్రిలియంట్, అంతకుమించి మంచి అందగాడు... నేను అతనిని చూడందే వుండలేను అనే స్థితికి వచ్చేను. అంత పిచ్చిగా అతన్ని ప్రేమించి, ఆరాధించేను. ఏకమైన మనస్సులు విప్పిచెప్పుకోని రోజుఅంటూ లేదు.

కాని ఈ మధ్యకాలంలో 'శ్రీధర్'లో చలాకీతనం పోయింది. దేనికోసమో తెగ ఆలోచించడం ఎక్కువైంది. అది తెలుసుకోవాలని నేను ఎన్నోవిధాల ప్రయత్నం చేసాను. ఏదో నానుండి దాస్తున్నాడని తెలియగానే నేను తెగఆరాటపడిపోయాను.

ఆ రోజు హాస్పటల్‌నుండి ఇద్దరంకలసి బయటకు వస్తూవున్నపుడు కోటుజేబులోనుండి ఒక బరువైన కవరుతీసి ఇస్తూ ఇది చదివి రేపు నీ నిర్ణయంచెప్పు నిర్మలా వస్తాను అంటూ ఆగకుండా ముందుకు వెళ్ళిపోయాడు.... నేను కొన్ని క్షణాలు ఏమి మాట్లాడలేక పోయాను. అతని ప్రవర్తనకు చాలా ఆశ్చర్యపోయాను కాని ఏమి చేయలేక ఇంటికి త్వరగా వచ్చి బట్టలైన మార్చుకోకుండా అత నిచ్చిన కవరు చింపి చదివేను.

కాని...కాని...అది చదవగానే నేను ఏమైపోతున్నానో నాకేతెలియకుండా పోయింది. విధి క్రూరంగా నవ్వినట్లైంది. భగవంతుడు ఎంతనిర్దయుడు అని ఎంతో విలపించాను...

ఆ క్షణంలోనే 'శ్రీధర్' నాకు కొన్నివేలమైళ్ళు దూరమైనట్లు అనిపించింది. నా జీవితం అక్కడ నుండే మరోమలుపు తిరిగింది. ఆ వుత్తరంలో నా నిర్ణయంపై తన భవిష్యత్తు ఆధారపడివుందని వ్రాసాడు...శ్రీధర్ నన్ను నిజంగా చంపివేయలేక పోయావా అని ఎంతో రోదించాను. కాలం చాలాసేపు స్థంబించిపోయినట్లైంది.

నీవు ఎవరినో ప్రేమించివుంటే నేను సహించలేక పోయేదాన్ని శ్రీధర్...కాని నీ ఔన్నత్యాన్ని తెలుసుకొని నేను గర్వపడుతున్నాను. కాని నీవు ఎవర్ని ప్రేమించావో తెలుసా...అదే విచిత్రం. అతను ప్రేమించినది మా అక్కయ్య శ్యామలనేనని నేను అతనికి ఎలా చెప్పాలి. ఆలోచిస్తూ వుండిపోయాను.